

చౌదర్‌పల్లి డ్వాక్రా నిధుల డ్రాపై ఏపీఎం, సీసీల సస్పెన్షన్

యాచారం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): చౌదర్‌పల్లిలో డ్వాక్రా పొదుపు సంఘాలకు సంబంధించిన నిధులను ఫోర్జరీ సంతకాలతో డ్రా కావడానికి అప్పటి ఐకేపీ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి, సీసీ జంగయ్యలను బాధ్యులుగా గుర్తించి సస్పెండ్ చేశారు. నిధుల డ్రాపై న్యాయం చేయాలని చౌదర్‌పల్లి డ్వాక్రా సంఘాల మహిళలు ఇటీవల ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి మొరపెట్టుకున్నారు. దీనిపై కలెక్టర్ నారాయణరెడ్డి, డీఆర్‌డీవో పీడీ శ్రీలతలకు ఫోన్ చేసి మహిళలకు డబ్బు అందేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు. దీంతో ఎస్‌బీఐ బ్యాంక్ అధికారులు, డీఆర్‌డీఓ పీడీ విచారణ చేపట్టారు. కాగా, డ్వాక్రా సంఘాలను సమన్వయం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఏపీఎం, సీసీలను సస్పెండ్ చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

విద్యా వ్యవస్థను పట్టించుకోని ప్రభుత్వం

» ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సర్కార్ బడుల్లో కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించామని ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, తరగతి గదులు, టాయిలెట్స్ తదితర సమస్యలపై విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. చాలా పాఠశాల ఆవరణల్లో వర్షపు నీరు నిలిచి అవస్థలు పడుతున్నారన్నారు. పాఠశాలల్లో తగిన ఫర్నీచర్ ఉండగా విద్యార్థులను నేలపైన ఎందుకు కూర్చోబెడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, ఆదిల్‌అలీ, కాడమోని ప్రభాకర్, వినోద్, మహేందర్ పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను కొనసాగించాలి

» డీసీపీ రాజేశ్



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీసీపీ రాజేష్


కొందుర్గు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను కొనసాగించాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. గురువారం కొందుర్గు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. 100కు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలతో పాటు, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఇప్పటినుంచే వ్యూహాత్మకంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎఫ్ఐఆర్ నమోదైన కేసులను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం కొందుర్గు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల రికార్డులను పరిశీలించారు. షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, షాద్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్, కొందుర్గు ఎస్సై రవీందర్ నాయక్, బాలస్వామి పాల్గొన్నారు.

పాత విధానంలో రిజర్వేషన్లు అమలు చేస్తే

రంగారెడ్డి జిల్లా

స్థానాలు	మొత్తం	బీసీ రిజర్వ్‌డ్ (సుమారు)
జెడ్పీటీసీలు	21	4
ఎంపీపీలు	21	4
ఎంపీటీసీలు	230	48
సర్పంచ్‌లు	526	110
వార్డులు	4,668	980

బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులోనూ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల కథ మళ్లీ మొదటికి వచ్చింది. పాత విధానంలో రిజర్వేషన్లు 50శాతానికి మించకుండా ఎన్నికలు జరుపుకోవచ్చని సుప్రీం సూచించడంతో ఆశావహులతో పాటు అధికారులూ డీలా పడ్డారు. నామినేషన్లకు సిద్ధమైన ఆశావహులు.. ఇప్పుడిచ్చిన రిజర్వేషన్లు తారుమారైతే తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటని ఆందోళన చెందుతున్నారు. కాగా, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత హైకోర్టు స్టే ఇచ్చిన సంగతి తెలిసిందే.



మళ్లీ మొదటికి..

'సుప్రీం' తీర్పుతో అందరిలోనూ నిరాశ



బీసీ రిజర్వేషన్లపై సర్కార్‌కు ఎదురుదెబ్బ
ఆశావహులతో పాటు అధికారులూ డీలా
రిజర్వేషన్ల తారుమారుపై నేతల ఆందోళన
స్థానిక సంస్థల ఎన్నికలపై నీలినీడలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నీలినీడలు అలుముకున్నాయి. సుప్రీకోర్టు తీర్పు అనుకూలంగా వస్తుందని ఎదురుచూసిన ప్రభుత్వానికి చుక్కెదురైంది. దీంతో ప్రభుత్వం మళ్లీ పాత విధానంలోనే స్థానిక ఎన్నికలు నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా సుప్రీం కోర్టు తీర్పుతో ఆశావహులతో పాటు అధికారులు సైతం డీలాపడ్డారు. సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా పాత విధానంలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తే అధికారులు మళ్లీ కొత్తగా ఎన్నికల కసరత్తు మొదలు పెట్టాల్సి ఉంటుంది. దీనికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్ని నెలలుగా స్థానిక కసరత్తు చేసిన అధికారులు మళ్లీ రిజర్వేషన్ల ప్రక్రియతో పాటు మిగతా ఎన్నికల నిర్వహణపై కసరత్తు మొదలు పెట్టాల్సి ఉంటుంది.

రిజర్వేషన్లు తారుమారు..

మరో వైపు రిజర్వేషన్లు ఖరారు చేయడంతో దాదాపు అన్నిచోట్ల ఆశావహులు ఎన్నికల్లో నామినేషన్లకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఎన్నికల వ్యూహాల్లో భాగంగా కొందరు ఇప్పటికే భారీగా ఖర్చు చేశారు. విందులు, వినోదాల

మిగతా 5వ పేజీలో...

డీసీసీ అధ్యక్ష పదవికి శ్రీనివాస్‌రెడ్డి దరఖాస్తు



చల్లా నర్సింహారెడ్డికి దరఖాస్తును అందజేస్తున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్ష పదవికి కడ్తాల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. గురువారం డీసీసీ అధ్యక్షుడు, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డికి హైదరాబాద్‌లో ఆమనగల్లు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, ఆమనగల్లు మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి దరఖాస్తును అందజేశారు. పాతికేళ్లుగా పార్టీకి అందిస్తున్న సేవలను అధిష్ఠానం గుర్తించి తనకు అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్, యువజన కాం గ్రెస్, ఐఎన్‌టీయూసీలో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు వివిధ పదవులు నిర్వహించి పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేశానని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నాలుగు పర్యాయాలుగా కల్వకుర్తి నియోజకవర్గంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయం కోసం పనిచేశానని పేర్కొన్నారు. పదవులు ఉన్నా లేకపోయిన నిరంతరం ప్రజలమధ్యే ఉంటూ పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోయానని తెలిపారు. ఒకే జెండా కింద, విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ విధేయుడిగా పనిచేస్తున్న తనకు అవకాశం కల్పిస్తే పార్టీ ఆదేశాలకనుగుణంగా నడుచుకుంటానని పేర్కొన్నారు. సీఎం రేవంత్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ అబ్జర్వర్ రాబర్ట్ బ్రోసులకు కలిసి దరఖాస్తులు అందజేస్తానని తెలిపారు.



బంతిపూల సోయగం

దీపావళి పండుగ వేళ బంతి, చామంతి పూలకు మంచి డిమాండ్ ఉంటుంది. యాచారం మండలం చౌదర్‌పల్లి గేట్ సమీపంలో సాగర్‌హైవే పక్కన ఓ రైతు మూడెకరాల్లో బంతి పూలను సాగు చేశాడు. పొలంలో పూల విరగపూసి ఆ దారిన వెళ్లేవారిని అలరిస్తున్నాయి. దీపావళి పండుగ రోజు ఈ పూలను ఎక్కువగా కొనుగోలు చేస్తారు. ఇళ్లకు తోరణాలు, వ్యాపారులు ధనలక్ష్మి పూజలు చేస్తారు. కొందరు తోట వద్దకే వచ్చి పూలు కొనుగోలు చేస్తున్నారు. బంతి పూలు కిలో రూ.60 నుంచి రూ.80 వరకు ధర పలుకుతుంది.

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి)

రోడ్లపై ప్రమాదకరంగా ధాన్యం..



రైతులకు కల్లాలు అందుబాటులో లేక రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబోసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దారుల వెంట ధాన్యం ఎండబెడుతుండటంతో రాత్రి వేళ అవి కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కేశంపేట మండలం వేములనర్వ- సంగెం, అల్వాల, సంతాపూర్-రాయిచేడ్, నిర్దవెల్లి- తొమ్మిదిరేకుల, కాకునూర్ - కొండారెడ్డిపల్లి గ్రామాల మధ్యలో ఉన్న బీటీ రోడ్లపై మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. రాత్రి వేళల్లో ధాన్యంపై నల్లని కవర్లు కప్పుతుండటంతో వాహనదారులకు ప్రమాదాల బారిన పడుతున్నారు.

కేశంపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి)

రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం

రేపు బీసీ సంఘాల బంద్



కడ్తాలలో బీసీ సంఘాల నేతల ఐక్యతా రాగం

కడ్తాల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, మండల అధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్ అన్నారు. బీసీల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆరోపించారు. రిజర్వేషన్లపై హైకోర్టు స్టేను నిరసిస్తూ ఈనెల 18న బీసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయంగా రావాల్సిన వాటాను సాధించుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అఖిల పక్షం ఏర్పాటు చేసి ఢిల్లీకి తీసుకుపోవాలని వారు పేర్కొన్నారు. పార్లమెంట్‌లో బిల్లుపెట్టి ఆమోదించేలా బీజేపీ ఎంపీలు, మంత్రులు కృషి చేయాలన్నారు. ఈనెల నిర్వహించే బంద్‌కు అన్ని సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

కందుకూరు : బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ బీసీ సంఘం జాతీయ

మిగతా 6వ పేజీలో...

ఓటు చోరీలో బీజేపీ ఆధిపత్య రాజకీయం

» టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్



మైసిగండిలో సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్

కడ్తాల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దేశంలో ఓటు చోరీ ద్వారా బీజేపీ అధికారం సాధించి రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. దీనికి అడ్డుకట్ట వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రజలంతా కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో గురువారం బీజేపీ ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ బలంగా ఉన్న రాష్ట్రాలలో బీజేపీ పథకం ప్రకారం ఓటు చోరీకి పాల్పడుతూ అధికారాన్ని చేజిక్కించుకుంటుందని ఆరోపించారు. ప్రజలంతా ఏకమై ఓటు చోరీని అడ్డుకోకపోతే ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదమన్నారు. ఈనెల చివరివరకు సంతకాల సేకరణ పూర్తిచేసి ఎన్నికల కమిషన్‌ను ముట్టడిస్తామని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి అనుబంధంగా పనిచేస్తుందని మండిపడ్డారు. ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు జవహర్‌లాల్ నాయక్, హీరా సింగ్, కిషన్, తులసీరామ్‌నాయక్, శంకర్, రాము, సుదీర్, గోపి, జగన్, రమేశ్, నరేశ్, చిన్న, అమర్ సింగ్, సాయి, మోత్యా, రాజు, చత్రు, మల్లేశ్, శంకర్, చందర్, శ్రీను, పాండు, బుజ్జి, కమ్లీ, నీల, చిన్న, కంస్య తదితరులు పాల్గొన్నారు.

లెక్క తేల్చేందుకు..!

పంచాయతీల ఆస్తులు, వసతులపై సర్వే

ప్రత్యేక యాప్‌లో నమోదు
21 అంశాలపై వివరాల సేకరణ



గ్రామ పంచాయతీ కార్యాలయం

చేవెళ్ల, అక్టోరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లోని ఆస్తులు, మౌలిక వసతులపై సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రత్యేక జీపీ మానిటరింగ్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ యాప్‌లో గ్రామ పంచాయతీల ఆస్తులు, ప్రస్తుతం ఉన్న మౌలిక వసతుల వివరాలను నమోదు చేయనున్నారు. దీంతో చేవెళ్ల డివిజన్ పరిధిలోని మొత్తం 109 గ్రామ పంచాయతీల్లో వివరాలు సేకరించేందుకు కార్యదర్శులు సిద్ధమయ్యారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఏడాదిన్నర దాటుతోంది. దీంతో 2024 ఫిబ్రవరి నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. పారిశుధ్యం పడకేసింది. ముఖ్యంగా చెత్త సేకరణకు వినియోగించే ట్రాక్టర్లకు డీజిల్‌తో పాటు వాటి మరమ్మతులు చేపట్టడానికి కార్యదర్శులు సొంతంగా వారానికి రూ. 2వేల నుంచి రూ.3వేల వరకు వెచ్చిస్తున్నారు. వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్య పనులు, తాగునీటి వసతి, బోర్ల మరమ్మతులు, పైపులైను లీకేజీలు తదితర పనులకు నెలకు రూ. 10 వేలకు పైగానే

మిగతా 6వ పేజీలో...



వివరాలు నమోదు చేస్తున్నాం

ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న ఆస్తులు, మౌలిక వసతుల వివరాలను గ్రామ కార్యదర్శుల ద్వారా సేకరిస్తున్నాం. ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నాం. ప్రధానంగా ప్రభుత్వ భవనాలు, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, రోడ్లు, ప్రకృతి వనాలు, తాగునీటి వసతులు వంటివి నమోదు చేస్తున్నాం. సమగ్ర వివరాలను సేకరించి యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయిస్తున్నాం.

- విఠలేశ్వర్, ఎంపీవో, చేవెళ్ల

సాంకేతిక పరిజ్ఞానంతో సాగు చేద్దాం
అకిన్ అనలెటిక్స్ డైరెక్టర్ ఎన్.సుబ్బారావు
5



కుళ్లిన గుడ్ల పంపిణీపై అధికారుల విచారణ
6

డీసీసీ అధ్యక్ష పీఠానికి పోటాపోటీ

- ఒక్క తాండూరు నుంచి ఐదుగురి దరఖాస్తు
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేరునూ ప్రతిపాదించిన ముఖ్య కార్యకర్తలు
- అధ్యక్ష పీఠంపై పలువురి ఆసక్తి


అధ్యక్ష పదవికి దరఖాస్తు అందజేస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్

తాండూరు, అక్టోబరు 16(ఆంధ్ర జ్యోతి): జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం తాండూరు నుంచి అత్యధికులు పోటీ పడుతున్నారు. గురువారం యాలాల, బషీరాబాద్ మండలాలకు సంబంధించి వెంకోబా ఫంక్షన్ హాల్‌లో, తాండూరు టౌన్, తాండూరు మండలం, పెద్దేముల్ మండలానికి శ్రీ కన్వెన్షన్ హాల్లో సంస్థాగత నిర్మాణంపై సమావేశాలు నిర్వహించారు. ఏఐసీసీ తరుపున ఇంచార్జిగా వచ్చిన సూరజ్‌సింగ్‌ఠాకూర్, పీసీసీ నుంచి బెల్లయ్యనాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ సభ్యులు ఎం.రమేష్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు పాల్గొన్నారు. సూరజ్ సింగ్‌ఠాకూర్ మండలాల వారీగా ముఖ్య కార్యకర్తల అభిప్రాయలను స్వీకరించారు. డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తులను స్వీకరించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్వతహాగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశించకున్నా ఆయన పేరును మెజారిటీ కార్యకర్తలు సూరజ్‌సింగ్‌కు బలపర్చారు. ఇదిలా ఉంటే జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి వికారాబాద్ నుంచి సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, రఘువీరారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తనయుడు రిత్విక్‌రెడ్డి, లాల్‌కృష్ణప్రసాద్ పోటీ పడుతూ దరఖాస్తులు ఇచ్చారు. తాండూరు నుంచి మాత్రం ఐదుగురు జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రస్థాయి పదవుల్లో ఉన్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, కల్వ సుజాత దరఖాస్తు చేయగా, పార్టీ సీనియర్లు ఉత్తంచంద్, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శోభారాణి, బషీరాబాద్ మండలానికి చెందిన శంకరయ్య దరఖాస్తులు అందజేశారు. దరఖాస్తులను ఏఐసీసీ పరిశీలించిన తర్వాత అధ్యక్షుల పేరును ఖరారు చేస్తారని ప్రస్తుత డీసీసీ చీఫ్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూరజ్‌సింగ్‌ఠాకూర్ ఈ సూచించారు.

రిజర్వేషన్లకు ఉద్యమించాలి

- వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్



వికారాబాద్,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 18న జరగనున్న రాష్ట్ర బంద్‌కు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు బీసీ మేధావుల ఫోరం నేత, వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు కె.శ్రీనివాస్ తెలిపారు. రాజకీయ పార్టీలన్నీ చిత్తశుద్ధితో బీసీల ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన ప్రజలకు ఫలాలు అందాలని, బడుగు బలహీన వర్గాల్లో బీసీలకు అన్యాయం జరుగుతోందని, బీసీలను కులాల పేరిట విడగొట్టి రాజకీ య పార్టీలన్నీ 75ఏళ్లుగా అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. బీసీల్లో చైతన్యం రావడంతో న్యాయస్థానాలను ఆశ్రయించి రిజర్వేషన్లు 50 శాతం మించకూడదనే సుప్రీం కోర్టు తీర్పును చూపుతూ 42శాతం బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లకు 50శాతం పరిమితి ఉంటే రాష్ట్రంలో 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటించిన 42శాతం రిజర్వేషన్లను సాధించుకునేంత వరకు ఎవరూ భేషజాలకు పోకుండా కులాలు, పార్టీలు, వర్గాలు అనే బేధం లేకుండా కలిసికట్టుగా పోరాడేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బంద్ తర్వాత కార్యాచరణ తీసుకుని చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించుకునేంత వరకు తెలంగాణ ఉద్యమం తరహాలో పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

అయోధ్యకు చేరుకున్న జానపద కళా బృందం

బొంరాస్‌పేట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించే దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా తెలంగాణ జానపద కళా ప్రదర్శనల్లో పాల్గొనేందుకు గురువారం అక్కడికి చేరుకున్నట్లు కళాబృందం మాస్టర్ ఆర్.ప్రకాశ్ తెలిపారు. తెలంగాణ జానపద కళా ప్రదర్శన బోనాల ఉత్సవం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ప్రదర్శనలు నిర్వహిస్తామని, బృందంలో 15 మంది ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు కృష్ణయ్య, రమేశ్ మాస్టర్, మనీషా యాదవ్, చిన్నారి, శ్రావణి, నిఖిత, అనూష, బుగ్గేశ్, సిద్ధు, నిఖిల్‌యాదవ్, బ్రహ్మేంద్ర, పెంటప్ప, మాణిక్యం పాల్గొన్నారు.


అయోధ్యలో జానపద కళాకారుల బృందం

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్లు పంపిణీ చేస్తున్న మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే హైదరాబాద్ సభ్యులు

నందిగామ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నందిగామ మండల పరిధిలోని మేకగూడ ప్రభుత్వ పాఠశాలలో చుట్టు పక్కల గ్రామాలు పిట్టలగూడ, సంఘిగూడ, చలివేంద్రగూడ నుంచి వచ్చి చదువుకునే 31 మంది విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ యునైటెడ్ వే హైదరాబాద్ సంస్థల ఆధ్వర్యంలో గురువారం సైకిళ్లను పంపిణీ చేశారు. అదే విధంగా పాఠశాలకు టీవీ, ల్యాప్‌ట్యాప్, స్పోర్ట్స్ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వర్, మైక్రోసాఫ్ట్ కమ్యూనిటీ అఫైర్స్ ప్రతినిధి చందన, యునైటెడ్ వే హైదరాబాద్ సభ్యులు అదితి, మహేశ్వరి, నాయకులు బండారి రాజు, ఆంజనేయులు, నరసింహ పాల్గొన్నారు.

కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చే పార్టీ కాంగ్రెస్


సమావేశంలోల మాట్లాడుతున్న పార్లమెంట్ సభ్యుడు రాబర్ట్ బ్రూస్

చందానగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని పార్టీ బలోపేతానికి కృషిచేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని తమిళనాడు రాష్ట్ర తిరుణన్వేలి ఎంపీ రాబర్ట్ బ్రూస్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుడి ఎంపిక కోసం అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ హుడా కాలనీ ఏఎంసీ కన్వెన్షన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహంచారు. కార్యక్రమానికి రాబర్ట్ బ్రూస్, పీసీసీ ఉపాధ్యక్షుడు కోటంరెడ్డి వినయ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి, పీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షుడు నల్ల సంజీవ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాబర్ట్‌బ్రూస్ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తను గుర్తించి సముచిత స్థానాన్ని కల్పించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి అందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడితోనే సాధ్యమన్నారు. అలాంటి నాయకుడి ఎంపిక కోసం కార్యకర్తల,నాయకుల అభిప్రాయ సేకరణకు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కోటంరెడ్డి వినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. పీసీసీ ఆదేశాలతోనే అభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ యువతకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జగదీశ్వరగౌడ్ మాట్లాడుతూ... యువతతోనే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు ,కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర బీమా పథకాలను వినియోగించుకోవాలి : ఎంపీ


సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2015 నుంచి అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. గురువారం వికారాబాద్, రంగారెడ్డి జి ల్లాల లీడ్ బ్యాంక్ మేనేజర్లు యాదగిరి, సుశీల్ కుమార్‌లతో ఎంపీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అసంఘటిత కార్మికులు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం, వైకల్యం వంటి పరిస్థితుల్లో కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ పథకాలు భరోసా కలిస్తున్నాయని విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా పథకాల అమల్లో అగ్రస్థానంలో ఉండడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేసి, అన్ని బ్యాంకు శాఖలను అభినందించారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా 60ఏళ్ల పైబడిన వ్యక్తులు జీవితాంతం నెలకు రూ. వెయ్యి నుంచి 5000 వరకు పింఛన్ పొందే అవకాశం ఉందన్నారు. యువత తమ ఉద్యోగ దశలోనే దీనిలో చేరి భవిష్యత్ భద్రత పొందాలని సూచించారు. కేవలం 20 లేదా 456 చెల్లించడం ద్వారా రుపే కార్డు ద్వారా లక్షల వరకు జీవిత బీమా పొందొచ్చని తెలిపారు. గ్రామీణ యువత, మహిళలు, నిరుద్యోగులు, విద్యావంతులకు రుణాలు, సబ్సిడీల కేటాయింపులో చురుకుగా వ్యవహరించాలని లీడ్ బ్యాంక్ అధికారులను ఎంపీ కోరారు. కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా చేపట్టేందుకు సీఎఫ్‌ఎల్ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి, ఎంపీ వ్యక్తిగత కార్యదర్శులు విక్రమ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

మా కార్యదర్శిని డిప్యుటేషన్‌పై పంపొద్దు

- డీపీవో జయసుధకు క్యాద్గీరా, గంగ్వార్ గ్రామస్తుల వినతి


డీపీవో జయసుధకు వినతి పత్రం ఇస్తున్న ప్రజలు

బషీరాబాద్, అక్టోబరు 16(ఆంధ్ర జ్యోతి): ప్రతి నిత్యం అందుబాటులో ఉంటూ సేవాలందించే మా గ్రామ కార్యదర్శి శ్రుతిని డిప్యుటేషన్‌పై వేరొక చోటికి పంపించొద్దని క్యాద్గీరా, గంగ్వార్ గ్రామస్తులు వికారాబాద్ డీపీవో జయసుధను కలిసి వినతిపత్రం అందజేశారు. గురువారం యాలాల మండల పర్యటనకు వచ్చిన డీపీవోను పలువురు గ్రామస్తులు కలిసి కార్యదర్శి డిప్యూటేషన్ వెంటనే రద్దు చేయాలని విన్నవించారు. కార్యదర్శి గ్రామాల్లో సమస్యలు రాకుండా చూసుకునేవారని, ఆమెను డిప్యూటేషన్‌పై వేరొక ఊరికి ఎందుకు పంపించారో తెలియడం లేదని వారిచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. తమ గ్రామ కార్యదర్శిపై తామెవరూ ఫిర్యాదు చేయలేదని, డిప్యూటేషన్‌పై ఎందుకు పంపిస్తున్నారని డీపీవోను పలువురు ప్రశ్నించారు. ఎవరైనా రాజకీయాలు చేయాలనుకుంటే పార్టీల పరంగా చూసుకోవాలని, కార్యదర్శి జోలికి వస్తే ఊరుకునేదిలేదని గ్రామస్తులు పలువురు డీపీవో ఎదుట మండిపడ్డారు. గ్రామ కార్యదర్శిని రాజకీయ కుట్రతోనే పంపిస్తున్నారని, వెంటనే డిప్యూటేషన్ రద్దు చేయాలని డీపీవోతో గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. అంతకు క్యాద్గీరా, గంగ్వార్ గ్రామ ప్రజలు కార్యదర్శి డిప్యూటేషన్ రద్దు చేయాలని సబ్ కలెక్టర్, బషీరాబాద్ ఎంపీడీవో కార్యాలయాల్లో వేర్వేరుగా వినతి పత్రాలు అందించారు.

పాదయాత్రగా శబరిమలకు అయ్యప్ప స్వాములు


పాదయాత్రగా శబరిమలకు బయలుదేరిన అయ్యప్పస్వాములు

వికారాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి మాలాధారణ చేసిన వికారాబాద్‌కు చెందిన ఐదుగురు భక్తులు గురువారం పాదయాత్రగా శబరిమలకు బయలుదేరారు. రాకేష్, వెంకట్, శ్రీనివాస్‌గౌడ్, సాయికృష్ణ, శ్రీనివాస్‌లు ఇరుముడి కట్టుకుని అయ్యప్పస్వామి, హనుమాన్ ఆలయాల్లో పూజలు నిర్వహించి పాదయాత్రగా శబరిమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, అయ్యప్పస్వాములు వారి వెంట కొంతదూరం పాదయాత్రగా ముందుకు సాగారు.

కార్తీక పూజలకు కీసర గుట్టకు రండి

- మంత్రి శ్రీధర్‌బాబును కలిసి ఆహ్వాన పత్రికను అందజేసిన ట్రస్టు బోర్డు సభ్యుడు సురేష్‌యాదవ్



మల్కాజిగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలకు కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకోవాలని కీసర గుట్ట రామలింగేశ్వర స్వామి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడు బోనగిరి సురేష్‌యాదవ్ గురువారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. ఈ నెల 22 నుంచి కార్తీక మాసం ప్రారంభమవుతుందని నవంబరు 20వ తేదీ వరకు రామలింగేశ్వరాలయంలో మాస ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అన్నారు. నెల రోజుల పాటు కొనసాగే కార్తీక మాస పూజల్లో భాగంగా కీసరగుట్టను సందర్శించి స్వామివారి దర్శించుకోవాలని ఆహ్వానించారు. మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేసి శాలువాతో సన్మానించారు.

బీరు సీసాలో వ్యర్థాలు


కింగ్ ఫిషర్ బీరు సీసాలో కన్పిస్తున్న చెత్త

బంట్వారం, అక్టోబరు 16(ఆంధ్ర జ్యోతి): బంట్వారంలోని శ్రీ లక్ష్మీ వైన్స్‌లో గురువారం ఓ యువకుడు 5 బీరు సీసాలను కొని ఇంటికి వెళ్లి చూడగా ఓ బాటిల్‌లో చెత్త కన్పించింది. దీంతో అ యువకుడు కింగ్‌ఫిషర్ బీర్ బాటిల్‌ను వీడియో, ఫొటోలను తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. సదరు యువకుడు మాట్లాడుతూ.. పెద్ద బ్రాండ్ అయిన కింగ్‌ఫిషర్ కంపెనీ నుంచి నాణ్యతలేని ఉత్పత్తి రావడం ఏమిటని ప్రశ్నించాడు. ప్రజల ఆరోగ్యం పట్ల కంపెనీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఎక్సైజ్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాన్నారు. స్థానికులు కూడా ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తూ వైన్ షాపుల్లో విక్రయించే మద్యం నాణ్యతపై పర్యవేక్షణ పెంచాలని అధికారులను కోరారు. యువకుడు వైన్‌షాపు వద్దకు చేరుకొని వివరణ కోరగా తమకు సంబంధం లేదని సిబ్బంది అన్నారు. ఈ ఘటనపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రిన్సిపాల్‌కు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు

కొడంగల్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):కొడంగల్‌లోని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్ డాక్టర్ అబ్దుల్ కలాం స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు, ప్రశంశాపత్రం అందుకున్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్‌డీవో చైర్మన్ సతీశ్‌కుమార్, ఫౌండేషన్ చైర్మన్ సుదర్శన ఆచార్య, ట్రెస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డిల నుంచి అవార్డును అందుకున్నారు.


ప్రశంసా పత్రం అందుకుంటున్న అధ్యాపకుడు నరేశ్‌రాజ్



నర్సింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

నిబద్ధత గల నాయకుడు నర్సింహారెడ్డి

» బద్దం వర్ధంతి సభలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బద్దం నర్సింహారెడ్డి నిబద్ధత గల నాయకుడని, చిరకాలం ప్రజల్లో నిలిచి ఉంటాడని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం పోచారంలో జరిగిన బీఆర్ఎస్ నాయకుడు నర్సింహారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలో క్రియాశీలకంగా పనిచేశాడని కొనియాడారు. గతంలో గ్రామాభివృద్ధికి ఆయన కృషి మరువలేనిదన్నారు. పేదల కోసం ప్రజాప్రతినిధులను ఒప్పించి సమస్యల పరిష్కారానికి కృషిచేసిన గొప్పవ్యక్తి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రెడ్డియానాయక్, నాయకులు మందడి సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, బోయపల్లి రాజేశ్వర్‌రెడ్డి, శేఖర్, లక్ష్మారెడ్డి, కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ నాయకుడు బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బద్దం మమత, స్థానికులు పాల్గొన్నారు.

తండాలో ఘనంగా భోగ్ బండార్

కడ్తాల్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ తండాలో రాందడియా ఆలయంలో గురువారం భోగ్‌బండార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హాజరయ్యారు. హథీరామ్ బాబా మఠం పరిరక్షణకై ఈ నెల 18న తిరుపతిలో తలపెట్టిన భోగ్‌బండార్ కార్యక్రమం విజయవంతంపై చర్చించారు. అనంతరం హథీరామ్ భావోజీ బర్త్ దివాస్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో కడ్తాల మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, బీచ్యానాయక్, నరేందర్‌నాయక్, శివాజీ, రచ్చ శ్రీరాములు, రాజు, రెడ్యానాయక్, జైపాల్, రమేశ్, రాము, పాండు, గణేశ్, బద్య, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, రఘు, మల్లేశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలిరావాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాండు, నాయకులు

తలకొండపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈ నెల 24, 25వ తేదీల్లో మహబూబాబాద్ జిల్లా గార్లలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు తెలిపారు. మహాసభలకు కార్మికులు భారీగా కదిలొచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తలకొండపల్లిలో గురువారం మహాసభల విజయవంతంపై ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య అధ్యక్షతన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. పాండు, ఇతర నాయకులు మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి సమస్యలు పరిష్కరించాలని పాండు ప్రభుత్వాన్ని కోరారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ మండలాధ్యక్షుడు జంగయ్య, పాండు, రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

రేపు బీసీ బంద్‌ను జయప్రదం చేయాలి



ఐక్యత ప్రకటిస్తున్న బీసీ సంఘాల నాయకులు

కడ్తాల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, మండల అధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్ అన్నారు. బీసీల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. బీసీల రిజర్వేషన్లపై హైకోర్టు స్టేను నిరసిస్తూ ఈ నెల 18న బీసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ విజయవంతంపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రావాల్సిన వాటాను సాధించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్షాలను ఢిల్లీకి తీసుకుపోవాలని డిమాండ్ చేశారు. 18న నిర్వహించే బంద్‌కు అన్ని సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతివ్వాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కులకచర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కులకచర్ల మండల విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం కుషాయిగూడలో జరిగిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. సాల్విడ్ పాఠశాలకు చెందిన విద్యార్థి వాలీబాల్ అండర్-14 బాలికల విభాగంలో లావణ్య, అండర్-17 విభాగంలో సింధు, ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థి నిత్యశ్రీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

కబడ్డీ జట్టుకు అగస్త్య

పరిగి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పరిగి విద్యార్థి ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. పరిగి పట్టణంలోని ఇండస్‌వ్యాలీ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పడమటి అగస్త్య పరిగి స్టేడియంలో జరిగిన కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అగస్త్యను పాఠశాల ప్రిన్సిపాల్ పి.సునీల్‌కుమార్, పీడీ రాజేందర్ అభినందించారు.

మధ్యాహ్న భోజన మెనూ పాటించాలి

» నిర్లక్ష్యం చేశారని ఇన్‌చార్జి హెచ్‌ఎంపై సబ్ కలెక్టర్ ఆగ్రహం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఉమాశంకర్‌ప్రసాద్

తాండూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం చెంగోల్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించేలా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్ ఆదేశించారు. గురువారం పాఠశాలలో భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తుండగా మెనూ ప్రకారం పప్పు చేయాల్సి ఉండగా నీళ్ల చారు, సాంబారు చేయడంతో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ తప్పక పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.. పాఠశాల పరిసరాల పరిశుభ్రత ఎలా ఉంది, రెగ్యులర్‌గా గుడ్లు ఇస్తున్నారా? అనే విషయాలపై ఆరా తీశారు. ఆయన వెంట తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీవో విశ్వప్రసాద్, పంచాయతీ కార్యదర్శి అశోక్, కాంగ్రెస్ నాయకుడు రాము ఉన్నారు.

ఎర్రమట్టి తవ్వకాలను ఆపాలి

● లేదంటే ఆందోళనలు చేపడతాం

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్



అంతారంలో ఎర్రమట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు రమేశ్

తాండూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అంతారంలోని సర్వే నం 2 అసైన్డ్ భూమిలో ఎర్రమట్టి తవ్వకాలను ఆపకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేశ్ హెచ్చరించారు. గురువారం అంతారం శివారు అసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండా చేపడుతున్న ఎర్రమట్టి తవ్వకాలను ఆయన పరిశీలించారు. కాంట్రాక్టర్ కృష్ణమోహన్ రెండు ఎకరాల్లో పెద్ద గోతులు తీస్తూ ఎర్రమట్టిని తవ్వడం దుర్మార్గమని రమేశ్ అన్నారు. ఇదే విషయాన్ని ప్రశ్నిస్తే అనుమతి కోసం రెవెన్యూ, మైన్స్ అధికారులకు దరఖాస్తు చేశామని చెప్పారు. అనుమతి లేకుండా ఎలా తవ్వుతారని రమేశ్ ప్రశ్నించారు. ఎర్రమట్టి తవ్వకాలతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై తహసీల్దార్ తారాసింగ్‌ను సంప్రదించగా తాము అనుమతివ్వలేదని, ఇది మైన్స్ శాఖ అంశం అని పేర్కొన్నారని తెలిపారు. కలెక్టర్ చొరవ తీసుకొని ఎర్రమట్టి తవ్వకాలను నివారించకుంటే ఆందోళనలు చేస్తానని రమేశ్ అన్నారు. ఆయనతో శ్రీశైలం, సందీప్ ఉన్నారు.

మళ్లీ మొదటికి..



(మూడో పేజీ తరువాయి)

పేరుతో ఒక్కో గ్రామంలో లక్షలు ఖర్చుపెట్టారు. హైకోర్టు తీర్పు తర్వాత వీరంతా కొంత నిరాశ చెందినప్పటికీ సుప్రీంలోనైనా ఊరట దక్కుతుందని భావించారు. కానీ అక్కడ కూడా అనుకూలంగా తీర్పు రాకపోవడంతో తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. పాత విధానంలో ఎన్నికలు నిర్వహిస్తే రిజర్వేషన్లన్నీ తారుమారవుతాయి. దీంతో తమ రాజకీయ జీవితం కూడా తారుమారవుతుందని ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి ఈ సారి స్థానిక ఎన్నికల్లో 42శాతం బీసీలకు రిజర్వు చేయాలని సర్కార్ నిర్ణయించడంతో ఈ వర్గాల వారు ఈ రిజర్వేషన్ ఫలాలు పొందేందుకు ఆశగా ఎదురు చూశారు. ఇపుడు వారి ఆశలన్నీ అడియాలయ్యాయి.

కుల గణన ఆధారంగా పరిశీలిస్తే..

ఒకవేళ ప్రభుత్వం తప్పని పరిస్థితిలో పాత విధానంలోనే ఎన్నికలు నిర్వహిస్తే ఇటీవల ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో ఎలాంటి మార్పు ఉండదని చెబుతున్నారు. అలాగే బీసీలకు ఇపుడు ఇచ్చిన 42శాతం రిజర్వేషన్లకు స్థానంలో గతంలో మాదిరే 22శాతం లోపు జనాభా ప్రాతిపదికన ప్రాధాన్యత క్రమంలో ఆయా ప్రాంతాల్లో బీసీ రిజర్వుడు స్థానాలను కోటా ప్రకారం బదలాయించే అవకాశాలు ఉన్నాయి. ఉదాహరణకు గతంలో 42శాతం రిజర్వేషన్ ప్రకారం బీసీలకు 9 జెడ్పీటీసీ స్థానాలు రిజర్వుడు చేస్తే ఇపుడు 22శాతం ప్రకారం 4 సీట్లు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే గతంలో ఇచ్చిన స్థానాల స్థానే ఆరు స్థానాలను ఇపుడు రిజర్వుడు చేయాల్సి ఉండగా ఇందులో ఐదు స్థానాలను మినహాయించాలి. బీసీ జనాభాలో అధికంగా ఉన్న నాలుగు సీట్లను ఇప్పుడు రిజర్వు చేసి మిగతా వాటిని జనరల్ చేస్తారని, దీంతో కొంత కసరత్తు తగ్గుందని చెబుతున్నారు. మరో వైపు ఎస్సీ, ఎస్టీలు కూడా కులగణన సర్వే ఆధారంగా తమ జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక వేళ వీరి డిమాండ్‌ను కూడా పరిశీలిస్తే రిజర్వేషన్లపై కసరత్తు మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి ఉంటుంది. కులగణన సర్వే ద్వారా వచ్చిన వివరాల ప్రాతిపదికన బీసీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు స్థానాల్లో రిజర్వేషన్లు కల్పిస్తారు.

యంత్రాంగం ఎదురుచూపులు ..

మరో వైపు న్యాయస్థానం తీర్పుతో ఎన్నికల నిర్వహణపై అధికారులు ప్రభుత్వ తాజా ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి నోటిఫికేషన్ అనంతరం నామినేషన్లు స్వీకరించే సమయంలో ఎన్నిలకు బ్రేక్ పడిన సంగతి తెలిసిందే. అయితే ఇపుడు ఎన్నికలపై సర్కార్ తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా కసరత్తు చేసేందుకు అధికారులు మళ్లీ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జనాభా, ఓటర్ల జాబితాలు రెడీగా ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయడంతోపాటు బ్యాలెట్ పేపర్లు, ఇతర ఎన్నికల సామగ్రి సైతం అందుబాటులో ఉంది.



అంగడిరైచూర్‌లోని ఆరోగ్య కేంద్రం

ఆస్పత్రుల్లో అభివృద్ధి జాడేది?

● నిర్వహణ లేక తప్పని ఇబ్బందులు

కొడంగల్ రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులకు వచ్చే రోగులకు స్థానికంగా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక వసతులు కల్పించాలి. ఆసుపత్రిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలి. అయితే ఆస్పత్రుల నిర్వహణపై ఏర్పాటు చేసిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అటకెక్కింది. గతంలో పాలకవర్గ సభ్యులు చైర్మన్‌గా వ్యవహరించారు. వారి పదవీ కాలం ముగియడంతో మండల స్థాయి అధికారులైన ఎంపీడీవో, తహసీల్దార్‌లు ఆసుపత్రి కమిటీ సభ్యులుగా ఉంటారు. ప్రతి మూడు నెలలకోకసారి ఈ అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ఆసుపత్రిల్లో సమస్యలను గుర్తించి, పరిష్కారానికి అందుబాటులో ఉన్న నిధులు ఖర్చుచేయాలి. అయితే నాలుగేళ్లుగా నిధులు విడుదల కాలేదని సమాచారం.

హేమ్‌లాల్‌కు ఉత్తమ రైతు అవార్డు



రైతు హేమ్‌లాల్‌ను సన్మానిస్తున్న కంపెనీ మేనేజర్ సురేందర్

ఆమనగల్లు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పత్తిసాగులో అధిక దిగుబడి సాధించిన పలుగు తండా వాసి మూడావత్ హేమ్‌లాల్‌ను ఉత్తమ రైతుగా ఎంపిక చేశారు. గురువారం పవర్ సీడ్ కంపెనీ ఆధ్వర్యంలో హేమ్‌లాల్‌కు వ్యవసాయ క్షేత్రం వద్ద అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కంపెనీ మేనేజర్ సురేందర్ రైతును సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. అధిక దిగుబడులు సాధించిన హేమ్‌లాల్‌ను రైతులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

శామీర్‌పేట, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):రోడ్డు భద్రత నియమాలను వాహనాలను తప్పక పాటించాలని, జాగ్రత్తగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలను నివారించాలని సైబరాబాద్ మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. గురువారం తూంకుంట పరిధి దొంగల మైసమ్మ చౌరస్తా వద్ద రాజీవ్ రహదారిలో డీసీపీ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలు దశరథ్, రమేశ్, కానిస్టేబుళ్లు వాహనాల తనిఖీ చేపట్టారు. డీసీపీ మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే వాహనదారులకు, రోడ్డు వెంట వెళ్లే వారికి ఇలా అందరికీ క్షేమకరం అని అన్నారు. అతి వేగం, అజాగ్రత్తల వల్లే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. ప్రతీ వాహనదారుడు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రోడ్డుపై మెదలాలని కోటిరెడ్డి సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో సాగు చేద్దాం



డ్రోన్‌తో పురుగు మందు పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అకిన్ అనలెటిక్స్ ప్రతినిధులు

షాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేస్తే సమయం ఆదా అవుతుందని అకిన్ అనలెటిక్స్ డైరెక్టర్ ఎస్.సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ అమృత్ రాజ్ అన్నారు. గురువారం రేగడిదోస్వాడలో అకిన్ అనలెటిక్స్ కంపెనీ, సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో డ్రోన్‌తో పంటలపై పురుగు మందులు, ఎరువుల పిచికారిపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. డ్రోన్ వాడితే సమయం ఆదా అవుతుందన్నారు. రైతులకు శ్రమ తగ్గడంతో పాటు మొక్క మొత్తం తడిసేలా పిచికారి చేయగల్గుతామని చెప్పారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో స్ప్రే చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎకరా పొలంలో 5 నుంచి 6 నిమిషాల్లో స్ప్రేయింగ్ పూర్తవుతుందని, సాధారణ స్ప్రేయర్లతో గంట నుంచి రెండు గంటలు పడుతుందన్నారు. తెగుళ్లు సోకినపుడుతు ప్రాథమిక దశలోనే పిచికారి చేయాలని, ఆ సమయంలో కూలీలు దొరక్క పిచికారి ఆలస్యమైతే పంట దిగుబడి నష్టపోతామని తెలిపారు. డ్రోన్లు వచ్చాక ఆ ఇబ్బంది తప్పిందని, పురుగు మందును కూడా ఆదా చేయొచ్చన్నారు. పిచికారితో రైతులకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు సైతం తప్పాయన్నారు. సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞాన వాడకంతో పురుగు మందుల వ్యయం, శ్రమ, ఖర్చు, నీటి అవసరాన్ని తగ్గించొచ్చని, డ్రోన్లతో ప్రభావవంతంగా, ఏకరీతిగా పురుగుల మందును పిచికారి చేయవచ్చని చెప్పారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని సాగు చేస్తే పెట్టుబడులు తగ్గుతాయన్నారు. అలాగే దిగుబడులు సైతం పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో డ్రోన్ పైలెట్స్ పవన్, మనోజ్‌కుమార్, దిలీప్‌కుమార్, రైతులు ప్రవీణ్, మాధవరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్, చంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రికి త్వరలో ఐసీయూ

» ఆకస్మిక తనిఖీలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



జిల్లా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో త్వరలో ఐసీయూ ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆస్పత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే జనరల్ వార్డు, డయాలసిస్ కేంద్రం, నర్సింగ్ కళాశాలను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. జనరల్ వార్డులో వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఆస్పత్రి భవనం లీకేజీల మరమ్మతులపై కలెక్టర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ఆస్పత్రి ఎదుట ఉన్న మురుగును రెండు రోజుల్లో దారి మళ్లిస్తామన్నారు. వైద్యులు ఆస్పతిలో ఆపరేషన్ల సంఖ్యను పెంచాలన్నారు. ఆస్పత్రిలో పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని వైద్యులు కోరాగా ఎమ్మెల్యే సీఐతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్యం, నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్‌కుమార్, ఆర్ఎంఓ ఆనంద్ కుమార్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ మూర్తి, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవి గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి ఉన్నారు.

ఫ్యాక్టరీ వ్యర్థాలతో ఉక్కిరిబిక్కిరి

తండా సమీపంలో పారబోస్తున్న వీబీఎస్ కంపెనీ



తగలబడుతున్న వ్యర్థాలు

పూడూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వీబీఎస్ ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. జనావాసాల్లో కంపెనీ వ్యర్థాలను తగలబెతూ ప్రజారోగ్యాన్ని పాడుచేస్తోంది. పూడూరు మండలం రాకంచర్ల ఇండస్ట్రియల్ ఏరియాలో వీబీఎస్ ఫ్యాక్టరీ ఉంది. ఇక్కడ స్టీలు తయారీ అనంతరం వచ్చే వ్యర్థాలను చినబండతండా సమీపంలో డ్రమ్ములు, పాలిథిన్ కవర్లలో వేసి పారబోస్తున్నారు. కొందరు అక్కడే కెమికల్ వ్యర్థాలను కూడా పారబోస్తున్నారు. గురువారం వ్యర్థాలను తగలబెట్టడంతో మంటలు చెలరేగి పొగలు కమ్ముకున్నాయి. పొగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని తండా వాసులు వాపోతున్నాపరు. ఈ పొగలతో వ్యాధులు వస్తున్నాయని యాజమాన్యానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని, తమను గేటు లోపలికి అనుమతించడం లేదని చెప్పారు. అధికారులు, పీసీబీ ఫ్యాక్టరీని మూసివేయించి డిమాండ్ చేశారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదిబట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో, విద్య ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ జన సమితి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామ నిరంజన్ అన్నారు. గురువారం తహసీల్దార్ అయప్పకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుల గణన నిర్వహించి, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. బీసీ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఆయనతో రమేష్ తదితరులు ఉన్నారు.



చంద్రకళను సన్మానిస్తున్న డివిజన్ తహసీల్దార్లు

స్పెషల్ గ్రేడ్ డిప్యుటీ కలెక్టర్‌కు సన్మానం

చేవెళ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్పెషల్ గ్రేడ్ డిప్యుటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన చేవెళ్ల ఆర్డీవో కె.చంద్రకళను తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈమేరకు గురువారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో చంద్రకళను చేవెళ్ల డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు శాలువాలు, పూలబొకేలు అందించి సత్కరించి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల తహసీల్దార్లు బి. కృష్ణయ్య, గౌతమ్‌కుమార్, సురేందర్, అన్వర్, ఆర్డీవో కార్యాలయం ఏవో రాజశేఖర్, డిప్యూటీ తహసీల్దార్, రాజేంద్ర, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష ఎన్నికకు నేడు అభిప్రాయ సేకరణ

ఆమనగల్లు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్ష ఎన్నికకు సంబంధించి నేడు(శుక్రవారం) ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్‌లో మధ్యాహ్నం 2గంటలకు అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహిస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌లు తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల్,మాడ్గుల, తలకొండపల్లి మండలాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. ఏఐసీసీ పరిశీలకుడు, ఎంపీ రాబర్ట్ బ్రోసు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీయుఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్ రెడ్డి, కార్పొరేటర్ విజయరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం

(మూడో పేజీ తరువాయి)

అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు ఈనెల 18న నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, నాయకులు సరికొండ మల్లేష్, మన్నె జయేందర్‌ముదిరాజ్, డి.శ్రీరాములు, గౌర ప్రభాకర్, రమేష్‌గౌడ్, కుమ్మరి నరసింహ, జి.దేవేందర్‌గౌడ్, మోటి రమేష్, సురేష్‌గౌడ్, రవిందర్‌గౌడ్, అమరేందర్, జంగయ్య, అక్కనపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : ఐక్యత చాటుతున్న బీసీ సంఘం నాయకులతో ఎగ్గిడి సత్తయ్య

బీసీ ఉద్యమానికి ఎల్‌హెచ్‌పీఎస్ మద్దతు

షాద్‌నగర్ అర్బన్ : బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం చేపడుతున్న ఉద్యమానికి మద్దతునిస్తున్నట్టు ఎల్ హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తున్నట్టు ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన రిజర్వేషన్లకు చట్టబద్ధతను కల్పించడంలో విఫలమైందని అన్నారు. ఈనెల 18న నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌కు పూర్తి మద్దతునిస్తామని ఈమేరకు వారు తెలిపారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా ఉపేందర్

మహేశ్వరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా డబిల్‌గూడ గ్రామానికి చెందిన ఉపేందర్ నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పజెప్పినందుకు మండల అధ్యక్షుడు యాదీష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. అదేవిధంగా పార్టీ ఏ పిలుపునిచ్చినా ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు పార్టీని మరింత బలోపేతం చేయడానికి పాటుపడుతానని అన్నారు.



ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలోని దుర్గామాత ఆలయంలో నిర్మిస్తున్న అష్టాదశ శక్తిపీఠాల కోసం నాన్యానాయక్ అనే తహసీల్దార్ రూ.50వేల విరాళమిచ్చారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో తహసీల్దార్‌గా పనిచేస్తున్న నాన్యానాయక్ గురువారం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులుకు విరాళం ఇచ్చి భక్తిని చాటుకున్నారు. ఆలయ అభివృద్ధి కోసం విరాళం ఇచ్చిన నాన్యానాయక్‌కు సన్మానించి, ఆశీర్వదించారు. మాజీ కౌన్సిలర్ టి. ప్రతాప్‌రెడ్డి, టీఎన్‌జీవోస్ నాయకులు ఎం.వెంకట్‌రెడ్డిలు పాల్గొన్నారు.



విరాళం ఇస్తున్న తహసీల్దార్ నాన్యానాయక్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

కొత్తూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో మొండి నాగయ్య(39) అనే కూలీ మృతిచెందాడని ఎస్సై గోపాలకృష్ణ తెలిపారు. తిమ్మాపూర్‌లో నివాసముంటున్న నాగయ్య స్టేషన్‌తిమ్మాపూర్‌లో గల ఓ పరిశ్రమలో కూలీగా పనిచేస్తున్నాడని తెలిపారు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా, కొత్తూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు నాగయ్యను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

కొత్తూర్/మాడ్గుల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. కొత్తూర్ మండల కేంద్రంలోని బైపాస్ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలైనట్లు ఎస్సై సత్యశీలారెడ్డి తెలిపారు. పుట్ట మల్లేష్, నవీన్, ఆయన కుమారుడు లోకేష్‌లు కలిసి ఈనెల 13న ద్విచక్ర వాహనంపై దేవరకద్ర నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా, వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఉస్మానియాకు తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారని, మల్లేష్ బంధువు గురువారం ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అలాగే మాడ్గుల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమీపాన గుర్తుతెలియని కారు బైక్‌ను ఢీకొట్టడంతో ఆమనగల్లుకు చెందిన కొమ్ము వెంకటేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని నల్లచెర్వులో బుధవారం వెంకటేశ్ బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లి రాత్రి మాడ్గులలో విశ్రాంతి తీసుకున్నాడు. గురువారం ఉదయం నల్లచెర్వుకు బైక్‌పై వెళుతుండగా కారు ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు బాధితుడి సోదరుడు అబ్దుల్ తెలిపారు.

ఇసుక ఫిల్టర్ల ధ్వంసం

తలకొండపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధి చుక్కాపూర్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక ఫిల్టర్లపై పోలీసులు, రెవెన్యూ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. పొలాలు, వాగుల వద్ద ఇసుక ఫిల్టర్లు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ శ్రీకాంత్, ఆర్‌ఐ శ్రావణ్, సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. పలు చోట్ల ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేశారు. కృత్రిమ ఇసుక తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

కుళ్లిన గుడ్ల పంపిణీపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కేశంపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చింతకుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన గుడ్లు సరఫరా అవుతున్న వైనంపై షాద్‌నగర్ సీడీపీవో ఉదయ స్పందించారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'అంగన్‌వాడీకి కుళ్లిన గుడ్లు' శీర్షికన వార్తాకథనం ప్రచురితమైంది. అంగన్వాడీకి వచ్చిన కుళ్లిన గుడ్లపై విచారణ చేయాలని కొత్తపేట, కేశంపేట సెక్టార్ సూపర్‌వైజర్లు శమంతకమణి, దివ్యాసింగ్‌లను ఆమె ఆదేశించారు. దీంతో క్షేత్ర స్థాయిలో విచారణ చేశారు. అంగన్‌వాడీ నుంచి గుడ్లు తీసుకున్న కృష్ణమ్మ ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అక్టోబరుకు సంబంధించి 30గుడ్లను బుధవారం తీసుకున్నానని, వాటిలో నాలుగుగుడ్లు కుళ్లిపోయి యాని తెలిపింది. ఇక మీదట మంచి గుడ్లనే తీసుకుంటానని చెప్పింది. ఆమె చెప్పిన విధంగానే సూపర్‌వైజర్లు లెటర్ రాయించుకున్నారు.



కృష్ణమ్మను విచారిస్తున్న సూపర్‌వైజర్లు

లెక్క తేల్చేందుకు..!

(మూడో పేజీ తరువాయి)

ఖర్చువుతున్నాయని గ్రామ కార్యదర్శులు స్పష్టం చేస్తున్నారు. వారు నిత్యం ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు. అయితే త్వరలో ఎన్నికలు నిర్వహించాల్సిన నేపథ్యంలో గ్రామ పంచాయతీల్లో ఆస్తులు, మౌలిక వసతులపై సర్వే నిర్వహించడం కొంత ప్రాధాన్యం సంతరించుకుంది.

21 అంశాలపై వివరాల సేకరణ

రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు సర్వేలో 21 అంశాలకు సంబంధించి సమగ్ర మౌలిక వసతుల వివరాలను సేకరించనున్నారు. పంచాయతీ కార్యదర్శులు వినియోగిస్తున్న జీపీ మానిటరింగ్ యాప్‌ను నవీకరించి సర్వేకు సంబంధించిన వివరాలను పొందుపర్చారు. డివిజన్ పరిధిలో ఉన్న చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లో ఉన్న 109 గ్రామ పంచాయతీల్లో సర్వే చేపట్టనున్నారు. కార్యదర్శులు గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం, ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్, సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీ, పాఠశాల, వైకుంఠ ధామం, సామాజిక ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఆరోగ్య కేంద్రాలు, పల్లె ప్రకృతి వనం, సీసీ రోడ్లు, అనుబంధ గ్రామాలకు లింకు రోడ్లు, వీవో భవనం, క్రీడా ప్రాంగణం, వరద కాల్వలు, మురుగు కాల్వలు, తాగునీరు, వీధి దీపాలు, పశువులకు నీటి తొట్టిలు, గ్రంథాలయాలను పరిశీలించి అందులో ఉన్న వసతుల వివరాలు సేకరించనున్నారు. ఈ సర్వేతో పంచాయతీల్లో ఉన్న ప్రభుత్వ ఆస్తుల్లో ఎలాంటి వసతులున్నాయి. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా, ప్రజల అవసరాలు, కల్పించాల్సిన వసతులు ఏమిటనేది లెక్క తేలుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఆడబిడ్డల వివాహాలకు ఆర్థికసాయం



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డల పెళ్ళిళ్లకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తున్నదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గుర్తుచేశారు. షాద్‌నగర్‌లోని క్యాంపు ఆఫీసులో గురువారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. జిల్లేడు చౌదరిగూడ మండలంలోని 69 మందికి, కొత్తూర్ మండలంలోని 11మందికి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఇస్తున్న ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుని, ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నారు.

కడ్తాల ఎంఈవోగా నిర్మల బాధ్యతల స్వీకరణ

కడ్తాల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల విద్యాధికారిగా నిర్మల గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సత్యనారాయణ అనారోగ్య కారణాల వల్ల బాధ్యతల నుంచి వైదొలిగాడు. దాంతో ఆర్జేడీ ఆదేశానుసారం ముద్విన్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మలకు బాధ్యతలు అప్పగించారు. నిర్మలను యూటీఎఫ్ మండలాధ్యక్షుడు జంగయ్య, పీఆర్‌టీయు మండలాధ్యక్షురాలు పద్మ, ఉపాధ్యాయ సంఘం నాయకులు రాధాకృష్ణారెడ్డి, భీముడు, రవీందర్‌రెడ్డి, మల్లయ్య, శ్వేత, మాధురి, కౌసల్య, భాగ్యలక్ష్మి, స్రవంతి, హేమ, శంకర్, రజాక్‌లు సత్కరించి అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, నిర్ణీత సమయంలోపు సిలబస్‌ను పూర్తి చేయాలని సూచించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పదిలో 100 శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు.

ప్రజాపాలనలో ప్రతీ కుటుంబానికి మేలు



ఆమనగల్లు : చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు/తలకొండపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రతీ కుటుంబానికి మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తుంటే ఓర్వలేని విపక్షాలు అడుగడుగునా అడ్డుకుంటూ ప్రగతి నిరోధకంగా మారాయని అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పాలన సాగుతుందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క పేద కుటుంబానికీ రేషన్ కార్డు కొత్తగా ఇవ్వలేదని, కాంగ్రెస్ రాజకీయాలకతీతంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఎన్ని అడ్డంకులెదురైనా 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలుచేసి తీరుతుందని చెప్పారు. నాయకులు శ్రీనివాసమూర్తి, రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, గుజ్జల మహేశ్, సురేందర్‌రెడ్డి, జగన్, యాదయ్యగౌడ్, తదితరులు ఉన్నారు.

గాయపడ్డ విద్యార్థినికి ఎమ్మెల్యే పరామర్శ

రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తలకొండపల్లి మండలం మాదాయిపల్లికి చెందిన వెల్జాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని లక్ష్మీ ప్రసన్నను గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. పాఠశాల నుంచి బొలెరో వాహనంలో ఇంటికి వెళ్తుండగా లక్ష్మీప్రసన్న ప్రమాదవ శాత్తు కిందపడి గాయపడింది. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే కసిరెడ్డి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యచికిత్స నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి రూ.5వేలు అందించారు. నాయకులు శ్రీనివాసమూర్తి, వెంకట్‌రెడ్డి, గుజ్జల మహేశ్, అంజయ్యగౌడ్, అంబాజీ, తదితరులు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాపోలే తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామంలో నిర్వహిస్తున్న శీతాకాల శిబిరం గురువారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా విద్యార్థినులు ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామస్తుల దినచర్య, పనులు, విద్య, తదితర విషయాలను సేకరించారు. డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యానికి కావాల్సిన సూచనలు, సలహాలు అందంచారు.



వివరాలు నమోదు చేస్తున్న విద్యార్థినులు

బాధిత కుటుంబానికి పరామర్శ

తలకొండపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చుక్కాపూర్ గ్రామానికి చెందిన దాసరి పోచమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలి కుటుంబాన్ని గురువారం మాజీ ఎంపీటీసీ యాదయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు పరామర్శించారు. ప్రభాకర్‌రెడ్డి రూ.3వేలు, శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డిలు రూ.5వేలు, మాజీ సర్పంచ్ దాసరి కిష్టమ్మ రూ.వెయ్యి ఆర్థికసాయం అందజేశారు.

గ్రామాభివృద్ధికి కృషి

షాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లి గ్రామంలో అధికారులతో మాట్లాడి నూతనంగా బోరు వేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యలు ఎదురుకాకుండా అధికారులతో మాట్లాడి నూతనంగా బోరును వేయించామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు.



బోరును ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి

బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపజేయాలి

తలకొండపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల రిజర్వేషన్ల విషయంలో ద్వంద వైఖరి అవలంభిస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్ష నేతలను ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. జోలం వెంకటయ్య యాదవ్, లింగంగౌడ్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి : మాట్లాడుతున్న శ్రీనివాస్‌యాదవ్

42శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

కేశంపేట : తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కేశంపేట మండల జనసేన అధ్యక్షుడు రాజునాయక్ ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీలు రాజకీయ, ఉద్యోగ పరంగా ఎదగాలంటే రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఈనెల 18న నిర్వహించే బీసీల బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కొత్తపేటకు చెందిన లెంకపోతులు కుమార్‌గౌడ్, మామిడి యాదయ్యగౌడ్‌లు బీసీల బంద్‌కు అన్నిపార్టీల నాయకులు మద్దతు తెలపాలన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

షాబాద్ : ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌ను విజయవంతం చేయాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాడుతామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. షాబాద్‌లో అంబేడ్కర్ చౌరస్తాలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో 5వ రోజు రిలే దీక్ష చేపట్టారు. కురుమ సంఘం, ముదిరాజ్ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు చేవెళ్ల స్వామి, మద్దూరి పాండు, రాజేందర్‌గౌడ్, రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులు, జంగయ్య, రాజు, రాము, దర్శన్, రమేష్‌యాదవ్, తదితరులున్నారు.

డీజీపీని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



శివధర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జీఎల్‌ఎన్ రెడ్డి, పత్యనాయక్

ఆమనగల్లు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బి.శివధర్‌రెడ్డిని గురువారం రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యనాయక్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో శివధర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని డీజీపీకి వినతిపత్రం అందజేసినట్లు జీఎల్‌ఎన్‌రెడ్డి, పత్యనాయక్‌లు పేర్కొన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. డీజీపీని కలిసిన వారిలో నాయకులు రాజేందర్ పాటిల్, వరికుప్పల గణేశ్, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆమనగల్లు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. చిరు ధాన్యాలు ఆహారంలో విధిగా తీసుకోవాలని సూచించారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. టీచర్లు విజయలక్ష్మి, నాగశిరోమణి, అలివేలు, సారమ్మ, రాములమ్మ, ముత్యాలమ్మ, భారతమ్మ, సువర్ణ, లక్ష్మి, సాలి పాల్గొన్నారు.

తలకొండపల్లి : రాంపూర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. వెల్జాల సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల హాజరయ్యారు. గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించి పౌష్టికాహార పదార్థాలను అందించారు. టీచర్లు పద్మ, లక్ష్మి, ఏఎన్‌ఎం రేవతి, ఉపాధ్యాయులు భిక్షపతి, పావని, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జోనల్ స్థాయి ఖో-ఖో పోటీలు

శంకర్‌పల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలోని ఆదర్శపాఠశాల ఆవరణలో జోనల్ స్థాయి ఖో-ఖో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జోనల్ సెక్రటరీ ప్రభాకర్ తెలిపారు. 69వ జోనల్‌స్థాయి ఎస్‌జీఎఫ్ ఖో-ఖో పోటీలు ఈనెల 18న శనివారం చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల విద్యాధికారులు పురందాస్, అక్బర్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. జోన్‌లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు (అండర్-14, 17) పాల్గొనాలని తెలిపారు. వివరాలను ఫోన్‌నెంబర్ 99121-83921ను సంప్రదించాలన్నారు.

కందుకూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా విఠల్‌రెడ్డి

కందుకూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామానికి చెందిన సురసాని విఠల్‌రెడ్డి కందుకూరు లయన్స్ క్లబ్-19వ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఆ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డితో కలిసి గురువారం మండల కేంద్రంలో ఆ క్లబ్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా ఎస్.విఠల్‌రెడ్డి, కార్యదర్శిగా తీగల జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా కె.వెంకటేశ్వర్లు గుప్తలను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం వారితో ప్రమాణ శ్రీకారం చేయించారు. క్లబ్ ఎల్‌సీఐఎఫ్ కో-ఆర్డినేటర్ బీఆర్ రాంరెడ్డి, జీఎస్టీ కో-ఆర్డినేటర్ ఎస్.వెంకట్‌రంగారెడ్డి, జీఎంటీ కో-ఆర్డినేటర్ అంజయ్య, ఉమెన్ కో-ఆర్డినేటర్ దీపారెడ్డి, మాజీ అధ్యక్షులు కేశవరెడ్డి, ఎస్.జనార్ధన్‌రెడ్డి, లింగయ్య, తదితరులున్నారు.



విఠల్‌రెడ్డిని సన్మానిస్తున్న మహేంద్రకుమార్ రెడ్డి

బాలుడికి ఆర్థికసాయం

కొత్తూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడ్డ రిషి కుటుంబానికి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ రూ.10వేల ఆర్థికసాయం అందజేసి పరామర్శించారు. రిషి శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సత్యనారాయణ ఆసుపత్రికి తరలివెళ్లి ఆర్థికసాయం అందజేశారు. గూడూర్ మాజీ సర్పంచ్ సత్తయ్య, నాయకులు గుండు సురేష్, జగన్, సుధాకర్, లింగంగౌడ్, జైపాల్, సుధాకర్‌రెడ్డిలు రిషీని పరామర్శించిన వారిలో ఉన్నారు.



రిషీని పరామర్శిస్తున్న సత్యనారాయణ

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు వేగవంతంగా నిర్మించుకోవాలని ఎంపీడీవో మాధురి కోరారు. రాంనుంతల పెద్దతండా, గేటు తండాలో గురువారం ఇందిరమ్మ ఇళ్లను మాధురి పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యదర్శులకు సూచించారు.


శంకర్‌పల్లి : శంకర్‌పల్లి మున్సిపల్‌లోని క్రిస్టల్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీ ప్రెసిడెంట్ ప్రతాప్‌రెడ్డి కోరారు. కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులతో కలిసి మున్సిపల్ కమిషనర్ యోగేష్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, పాత పైపులైను తీసివేసి కొత్తది వేయాలని కోరారు. సీసీరోడ్లు వేసి రోడ్డు సమస్యను తీర్చాలన్నారు. లో ఓల్టేజీ సమస్యను తీర్చాలని విద్యుత్ ఏఈ ప్రదీప్‌కుమార్‌ను కోరారు.

శంకర్‌పల్లి : ఉచితవైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గోపులారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తెలిపారు. హ్యాపీ విజన్ లేజర్ ఐ కేర్ ఆసుపత్రి(శంకర్‌పల్లి) వైద్యులు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోపులారంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు.

తలకొండపల్లి : ఇబ్రహీంపట్నంలో నిర్వహించే మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయు ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య కోరారు. ఈనెల 26, 27వ తేదీలలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాళ్లు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సభలకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను కార్మిక సంఘం నాయకురాళ్లతో కలిసి ఆవిష్కరించారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కొత్తూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కోసం ఏర్పాటుచేస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశువైద్య డాక్టర్ స్ఫూర్తి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని శేరిగూడబద్రాయపల్లి, ఇన్ముల్‌నర్వ, కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలో పశు వైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్ఫూర్తి మాట్లాడుతూ మూడు గ్రామాల్లో 431 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, స్వరూప, రవి, రాజ్‌కుమార్, హనుమంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఇన్ముల్‌నర్వ గ్రామంలో టీకాలు వేస్తున్న డాక్టర్ స్ఫూర్తి